# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 02-01-2017**

తెలంగాణ రాష్ట్రంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న సుమారు 650 దేవాలయాలలో పనిచేస్తున్న సుమారు 5,800 మంది అర్చక, ఇతర సిబ్బంది వేతనాల చెల్లింపులకు సంబంధించి ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆదివారం సాయంత్రం ప్రగతి భవన్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. వీరి వేతనాల విషయంలో ఒక సమగ్రత తెచ్చి అక్కడ పనిచేసే వారందరికీ న్యాయం జరిగేట్టు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కె. ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రమణా చారి, ఎండోమెంట్స్ కమిషనర్ శివశంకర్, సిఎంవో అధికారి భూపాల్ రెడ్డి, అర్చక ఉద్యోగ ప్రతినిధులు పాల్గొన్నారు. సంక్రాంతితో అర్చకుల కష్టాలు తొలగిపోవాలని, ఆ దిశగా తగు చర్యలు తీసుకునేందుకు చేపట్టవలసిన కార్యక్రమం, విధివిధానాలను రూపొందించేందుకు సిఎం ఒక కమిటీని నియమించారు.

దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ప్రభుత్వ సలహాదారు రమణాచారీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, కమిషనర్ శివశంకర్ అడ్వకేట్ జనరల్ రామకృష్ణారెడ్డి, లా సెక్రటరీ సంతోష్ రడ్డి, అర్చక ప్రతినిధులు గంగు ఉపేంద్ర శర్మ, గంగు భాను మూర్తి, ఇతర సిబ్బంది తరపు ప్రతినిధులు మోహన్, రంగారెడ్డి ఉన్నారు. అర్చకులకు, ఇతర సిబ్బందికి వేతనాలు నేరుగా వారి అకౌంట్లో పడే విధంగా చెల్లించడానికి ఒక హెడ్ అఫ్ అకౌంట్ ఏర్పాటు చేసే విషయం, సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా (ఒకే పనికి ఒకే రకమైన వేతనం) అర్చకులకు, ఇతర సిబ్బందికి జీతాల చెల్లింపు, ఉద్యోగుల రెగ్యులరైజేషన్, రోస్టర్ సమస్యలు తదితర అంశాలపై ఈ కమిటీ అధ్యయనం చేసి ఒకటి, రెండు రోజుల్లో నివేదికను తనకు అందచేయాలని సిఎం ఆదేశించారు.

దేవాలయ భూములు, దేవాలయ మాన్యాలు, గత ప్రభుత్వాల హయాంలో వారి మితిమీరిన జోక్యం వల్ల అవినీతికి ఆలవాలమయ్యాయని, ఆధ్యాత్మిక వ్యవస్థ దెబ్బతిన్నదని, ఈ వ్యవస్థ చక్కబడాలని, దేవాలయ

భూములు అన్యాక్రాంతం కాకుండా, కౌలు పేరుమీద ఖబ్జాలకు గురి కాకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు. ఏ దేవాలయం కింద ఎన్ని మాన్యాలు, భూములు ఉన్నాయో లెక్క తేల్చాలని సిఎం ఆదేశించారు.

విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన పద్దతిలోనే, అర్చకులను, ఇతర సిబ్బందిని రెగ్యులర్ చేసే విషయం కూడా కులంకషంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దేవాలయాలు క్రమ శిక్షణకు స్థలాలని భవిష్యత్తులో వీటికి ట్రస్టు బోర్డులను ఏర్పాటు చేసేటప్పుడు ఆధ్యాత్మిక భావన ఉన్నవారినే సభ్యులుగా నియమించేందుకు నియమావళి రూపొందించాలని సిఎం అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో దేవాలయాల అభివృద్ధి అస్థవ్యస్థంగా జరిగిందని అందుకే యాదాద్రి, వేములవాడ, భద్రాది, ధర్మపురి, బాసర, జోగులాంబ లాంటి దేవాలయాలు సరైన అభివృద్ధికి నోచుకోలేదని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటి అభివృద్ధి విషయంలో సరైన చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు.

సిఎం తమ ఉద్యోగాల రెగ్యులరైజేషన్ విషయంలోనూ, వేతనాల చెల్లింపునకు సంబంధించి ఒక ప్రత్యేకమైన హెడ్ అఫ్ అకౌంట్ ఏర్పాటు చేసే విషయంలో కమిటీని ఏర్పాటు చేసినందుకు అర్చక, ఉద్యోగ ప్రతినిధులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

**సిపిఆర్ఓ టు సిఎం**